క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గంగవరం యూపీహెచ్‌సీలో శిబిరం

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు గంగవరం గ్రామ పరిధిలో రెండు సచివాలయాలకు సంబంధించి గంగవరం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ వినయ్ తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది సర్వేలో వైద్య పరీక్షలు అవసరమైన వారికి టోకెన్లు అందించారని తెలిపారు. వైద్యులు శిబిరంలో వారిని పరీక్షించి, మందులు అందజేస్తారని తెలియజేశారు.

8న మెగా రక్తదాన శిబిరం

గాజువాక: గాజువాక బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్ వద్ద ఈ నెల 8న పలువురు యువకుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు సనపల ఢిల్లీ, విష్ణు, గోపి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువశక్తే దేశ సంపద



స్వామి గీతా సారనంద మహరాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక: భారతదేశానికి యువత అద్భుత శక్తి అని స్వామి గీతా సారనంద మహరాజ్ అన్నారు. వివేకానంద ఆలోచనలు, యువత అంశంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచదేశాల్లో భారతదేశ యువత ప్రత్యేకతను కలిగి ఉంటారన్నారు. యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అహర్నిశలు శ్రమించాలని, క్రమశిక్షణతో దేనినైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో జాప్యంపై నిరసన

ఉక్కునగరం: కార్మికుల జీతాలపై స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ మౌనవ్రతం పాటిస్తోందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఆరోపించారు. కార్మికుల వేతనాల్లో జాప్యం జరగడంపై వైఎస్సార్‌టీయూసీ నిరసన వ్యక్తం చేసింది. బుధవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో రూ. 2 వేల కోట్లు ఉత్పత్తుల అమ్మకాలు జరిగి, రూ. 500 కోట్లు అడ్వాన్సులు వచ్చినప్పటికీ యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల నెలసరి చెల్లించే హౌసింగ్ లోన్ ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల డిఫాల్టర్ కావడంతో పాటు అపరాధ రుసుం కూడా చెల్లించాల్సి వస్తుందన్నారు. గుర్తింపు యూనియన్ ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, డి.పుల్లారావు, బి.రామకృష్ణ, పిట్టారెడ్డి, ఎన్నేటి రమణ, బి.వి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

అక్కిరెడ్డిపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై జోన్-5, 8 జోనల్ కమిషనర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లతో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. షీలానగర్‌లోని విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జెడ్సీలు కృష్ణ, మల్లయ్య నాయుడు, డీఎంహెచ్‌వో, ఏఎస్‌ఎంలు, వార్డు కార్పొరేటర్లు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ వార్డుల ఇన్‌చార్జిలు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం
- ప్రతీ పేద కుటుంబానికి వైద్యం చేరువ
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గాజువాకలో శిబిరానికి విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కొత్త గాజువాక యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఉచిత వైద్యసహాయం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందిస్తారన్నారు. అవసరమైన రోగులను మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తారని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, క్లస్టర్ అధ్యక్షులు ఎస్ఎండీ గౌస్, రాజాన వెంకటరావు, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, నాయకులు పల్లా చినతల్లి, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

14 మంది వైద్యులు..1220 మందికి సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే సర్వే నిర్వహించి రోగులను గుర్తించిన విషయం తెలిసిందే. వారందరికీ గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన శిబిరానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. సిబ్బంది 1220 మంది రోగులకు టోకెన్లను అందజేశారు. దాదాపు వారంతా ఈ శిబిరానికి హాజరు కావడంతో మొత్తం 14 మంది వైద్యులు సేవలను అందించారు. వారిలో కొంత



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మంది వైద్యులు స్వచ్ఛందంగా సేవలను అందించినట్టు గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన రక్త పరీక్షలు, ఇతర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

చాలా బాగా చూశారు



నేను భుజం నొప్పి, చెవి నొప్పితో కొద్దికాలంగా బాధ పడుతున్నాను. ఈ విషయాలను సర్వేకు వచ్చిన సిబ్బందికి చెప్పడంతో ఈ రోజు మెడికల్ క్యాంప్‌కు రమ్మని స్లిప్ ఇచ్చారు. వైద్యులు చాలా బాగా చూశారు. చాలా రకాలుగా పరీక్షించిన తరువాత మందులను ఇచ్చారు.

– మహ్మద్ అబ్దుల్ కుదుస్, గణేష్‌నగర్

బీపీ, షుగర్ చూపించుకున్నా



నాకు ఈ మధ్య ఆరోగ్యం బాగా ఉండడం లేదు. మొన్న సిబ్బంది మా ఇంటికి వచ్చి సర్వే నిర్వహించి నా ఆరోగ్యం గురించి అడిగారు. నాకున్న అనారోగ్య సమస్యలను చెబితే ఈ రోజు శిబిరానికి రమన్నారు. బీపీ, షుగర్ చూపించుకున్నాను. వైద్య పరీక్షల తరువాత నాకు మందులు ఇచ్చారు.

– ఎ.కమల, అజీమాబాద్

ఏడు రకాల మందులిచ్చారు



నాకు ఇక్కడి డాక్టర్లు ఏడు రకాల మందులను ఉచితంగా ఇచ్చారు. బీపీ, షుగర్‌తో పాటు మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పి వంటి వంటి సమస్యలను తెలియజేసి, ఇక్కడి వైద్యులకు చూపించుకున్నాను. ఈ పరీక్షల తరువాత నాకు మందులను ఉచితంగా ఇచ్చారు. డాక్టర్లు చాలా బాగా చూశారు.

– ఎం.సీత, సాయిరామ్‌నగర్

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



965వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 965వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశంలో ఓ చెరగని అధ్యాయమన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. సీపీఎం, స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు జరగనున్న బహిరంగ సభను కార్మికులు, ఉక్కు నిర్వాసితులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట



రాట వేస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: గాజువాక కనకదుర్గ చిల్లర వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు బుధవారం రాట ప్రతిష్టాపన చేశారు. గాజువాక మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ రాటను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ తదితరులు ప్రతిష్టించారు. ఈ నెల 15 నుంచి 24 వరకు దసరా నవరాత్రులను నిర్వహిస్తామని, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, సింహాచలం ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు దొడ్డి రమణ, చిల్లర వర్తక సంఘం ప్రతినిధులు కడవల నగేష్, జి.రాంబాబు, కె.గోవింద్, సిరికి రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

గాజువాక: గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా స్థానిక ట్వింకిల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉత్తమ రచనలకుగాను 10 మంది విద్యార్థులకు గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలను విద్యార్థి దశ నుంచే ఏర్పరుచుకుంటే ప్రపంచం గర్వించదగ్గ పౌరులుగా



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సీఐ

ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అనధికార నిర్మాణంపై ఫిర్యాదు

గాజువాక: వడ్లపూడి సర్వే నంబర్ 1/6లో గల ప్రభుత్వ భూమిలో ఒక వ్యక్తి అనధికార నిర్మాణాన్ని చేపట్టాడని సిద్ధార్థనగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గాజువాక అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. 1/6 సర్వే నంబర్‌లో 4.30 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో కొంత స్థలాన్ని ఒక ప్రైవేట్ వ్యక్తి ఆక్రమించి నిర్మాణం చేపట్టాడని తెలిపారు. రెండు వారాలుగా ఈ నిర్మాణం సాగుతోందని, స్థానిక సిబ్బందికి తాము సమాచారం ఇచ్చినా స్పందించలేదని పేర్కొన్నారు. ఈ నిర్మాణం కోసం నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసినట్టు తమ దృష్టికి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వచ్చిందన్నారు. దీనిపై పరిశీలించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో అసోసియేషన్ నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, జేఎస్ మూర్తి, ఎం.సూర్యనారాయణ, దాలయ్య, మోహన్‌రావు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాల చెల్లింపు

ఉక్కునగరం: ఎట్టకేలకు స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బుధవారం రాత్రి జీతాలు చెల్లించారు. అధికారులకు మరో రెండు రోజులు పడుతుందని సమాచారం. స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి కార్మికులకు నెలాఖరున జీతాలు చెల్లించేవారు. నెలాఖరు ఆదివారం అయితే ఆ ముందు రోజు గాని మర్నాడు ఒకటో తేదీన గానీ జీతాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటి వరకు కరోనా సమయంలో మాత్రమే ఒక్కసారి రెండో తేదీన జీతాలు చెల్లించారు. స్టీల్‌ప్లాంట్ చరిత్రలో మొట్టమొదట సారి ఇంత జాప్యం జరిగిందని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై గుర్తింపు యూనియన్ ధర్నాకు పరిమితం కాగా ప్రతిపక్ష ఐఎన్‌టీయూసీ, సిటూ వినతిపత్రాలు, చర్చలతో సరిపెట్టాయి. ఇటువంటి అంశంలో కూడా కార్మిక సంఘాలు ఐక్యంగా యాజమాన్యంపై ఒత్తిడి తేవకపోడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

8న భజన పోటీలకు బృందాల ఎంపిక

గాజువాక: చినగంట్యాడ త్రిశక్తి ఆలయంలో డిసెంబర్ 23 నుంచి నిర్వహించనున్న ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల స్థాయి ఆధ్యాత్మిక భజన పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 8న బృందాల ఎంపికను నిర్వహించనున్నట్టు త్రిశక్తి భజన మండలి అధ్యక్షుడు బి.రాజారావు తెలిపారు. భజన యజ్ఞం-8 పేరుతో త్రిశక్తి భజన మండలి, తిరుమల తిరుపతి దేవస్థానాల ధార్మిక మండలి విశాఖ జిల్లా విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ఆడిషన్స్ ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. భజన పోటీలకు 85200 46273 నంబర్‌లో, నాట్య పోటీలకు 99496 00780, భక్తి గీతాల పోటీలకు 99496 00780, రంగస్థల పద్య పోటీలకు 83329 59230, కోలాటం పోటీలకు 99496 00780 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు బహుమతులతో పాటు షీల్డ్, జ్ఞాపిక అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ప్రవేశ రుసుం లేదని, ఆసక్తి గల బృందాలు ఈ ఆడిషన్స్‌లో పాల్గొనాలని కోరారు.

ఏఐవైఎఫ్ ప్రతినిధుల స్టీల్‌ప్లాంట్ సందర్శన


ఉక్కునగరం: సీపీఐ అనుబంధ ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ ప్రతినిధులు బుధవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. విశాఖ పర్యటనలో భాగంగా 26 జిల్లాలకు చెందిన 40 మంది ప్రతినిధులు ప్లాంట్‌లోని పలు విభాగాల్లో పర్యటించారు. అక్కడ ఉత్పత్తి ప్రక్రియను ప్రత్యక్షంగా తిలకించారు. అక్కడ సిబ్బందితో ఉత్పత్తి ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, కె.రాజబాబు, తాంధ్ర కనకరాజు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన ఏఐవైఎఫ్ బృందం

కన్వీనర్లు, గృహ సారథుల బీమాపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డులోని కన్వీనర్లు, గృహ సారథులకు వర్తించే బీమా పథకంపై వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అవగాహన కల్పించారు. మిండి గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో కన్వీనర్లు, గృహ సారథులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గృహ సారథులకు పలు సూచనలు చేశారు. వారికి వర్తించే బీమా సౌకర్యం గురించి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, నాయకులు సంద్రాన నూకరాజు, జి.వెంకటలక్ష్మి, బోనెల జోసెఫ్, సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లతీష్

అనాథ బాలలకు వితరణ

పెదగంట్యాడ: జనరేషన్ యువ వెల్ఫేర్ సొసైటీకి చెందిన అనాథ బాలలకు వైఎస్సార్ సీపీ నాయకుడు తాటికొండ కాశి విశ్వేశ్వరరావు చేయూతనందించారు. విశ్వేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా వారికి నిత్యావసర సరకులను సమకూర్చారు. వాటిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన్‌రెడ్డి చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, తిప్పల వంశీరెడ్డి, గాంధీనగర్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ పాల్గొన్నారు.



సరకులు అందిస్తున్న విశ్వేశ్వరరావు తదితరులు

డీఈయూ నూతన కార్యవర్గం ఎన్నిక

అక్కిరెడ్డిపాలెం: భెల్ డెమోక్రటిక్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన టి.ఎల్.నర్సింగరావు అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా పి.భాస్కరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కోన రామారావు, సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎస్.ఆర్.సీహెచ్.మూర్తి, ఉపాధ్యక్షుడిగా వై.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా అక్కిరెడ్డి నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంయుక్త ప్రధాన కార్యదర్శిగా వి.చిట్టిబాబు, సంయుక్త కార్యదర్శిగా సత్యారావు, అసిస్టెంట్ కార్యదర్శిగా జె.విశ్వనాథం, కోశాధికారిగా జగదీశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూ.11.39 కోట్లతో వందడుగుల రోడ్డు విస్తరణ



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధిలో సుమారు 11 కోట్ల 39 లక్షల రూపాయలతో 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి పూజ చేసి పనులను ప్రారంభించారు. కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో అపార్టుమెంట్లు ఉండటంతో 86వ వార్డు అతి పెద్ద వార్డుగా అవతరించినా, ట్రాఫిక్ సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూర్మన్నపాలెం నేషనల్ హైవే నుంచి దువ్వాడ వీఎస్ఈజెడ్ వరకు గల సుమారు 1.6 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా 100 అడుగుల విస్తరణతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ గాజువాక నియోజవర్గంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల నిర్మాణానికి వార్డుల్లో శరవేగంతో పనులు జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా అభివృద్ధి చేయటానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న జగన్‌మోహన్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి దొరకటం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు, వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాస్, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

85వ వార్డులో సీసీ రోడ్లకు..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు గెంజిపేట పూజారికాలనీ,శ్రీరామ్‌నగర్‌లో రూ. కోటి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. పది రోజుల్లోనే పనులు పూర్తి చేసి, రోడ్డు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ 79వ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మీనాయుడు, సుందరపు అప్పారావు, కరణం కోటి, కాతా నూకేష్, యలమర్తి వెంకటరావు, కర్రి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెదగంట్యాడ: వాహన చోదకులకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి అభ్యున్నతి కోసం వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 64వ వార్డు పరిధిలోని యాతపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, వాహనమిత్ర లబ్ధిదారులతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ యాతపాలెం గ్రామంలో 80 మంది ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా నగదు జమ చేశారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారని, ఏటా రూ.10 వేల సాయాన్ని అర్హత ఉన్న ప్రతి ఆటో డ్రైవర్ అందుకుంటున్నారని తెలిపారు. వరుసగా ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర పథకం అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ సభ్యులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దేవన్‌రెడ్డి

ఆటోనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, ఆటోనగర్‌లలో రూ.1.18 కోట్లతో పనులకు భూమిపూజ

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు ఐలా కమిషనర్ జయచంద్ర, చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) బుధవారం శంకుస్థాపన చేశారు. పెదగంట్యాడ, ఆటోనగర్ ప్రాంతాల్లో రూ.1 కోటి 18 లక్షల 18 వేలతో పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ముందుగా పెదగంట్యాడ పారిశ్రామిక ప్రాంతంలోని ఓపెన్ ప్లేస్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, రూ.39.90 లక్షలతో చేపట్టనున్న 110 ఎంఎండయా వాటర్ సప్లై పైప్ లైన్, డ్రైనేజీ నిర్మాణ పనులకు, రూ.39.38 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిగ్నల్ పోల్స్, స్ట్రీట్ లైట్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆటోనగర్‌లో రూ.39.90 లక్షలతో డీ, ఈ-బ్లాక్‌లలో ఓపెన్ స్పేస్ కాంపౌండ్ వాల్‌కు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండురంగ ప్రసాద్, పెదగంట్యాడ ఐలా అధ్యక్షుడు సత్యనారాయణ, ఈ-బ్లాక్ మెంబర్ చుండూరు విశాలాక్షి, వాసీవా కోశాధికారి పి.ప్రభాకరరావు, డి.ఎక్స్‌టెన్షన్ మెంబర్ అశోక్ రాజు, పారిశ్రామిక వేత్తలు అట్లూరి రమేష్, పలువురు ఐలా సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా చైర్మన్ రఘు